# కేటు



ఆదిమధ్యం రమణమ్మ

సముద్ర తరంగాలు. పాముల్లా మెలికలు తిరుగుతూ, బుసలు కొడుతూ ఒడ్డును కాటు వేస్తున్నాయి. పాముకాటు తిన్న మనిషిలా సముద్ర తీరమంతా తెల్లని నురుగులు క్రక్కుతోంది.

చల్లగాలుల్ని మాత్రమే లోనికి రానిచ్చి తుఫానుగాలుల్ని అటకాయించే కలవారిరాతి మేడలూ ఆ ఒడ్డున వున్నై. పేదవారి పూరి పాకలూ వున్నాయి. చల్లగాలికి బద్ధకం. ఒంగి వాటిలో దూరదు. పెనుగాలికా యిబ్బందిలేదు తలుచుకుంటే ఆ తాటాకు పాకల్ని తుక్కు రేగ్గొట్టి కుప్పగూల్చ గలదు.

చీకటి పడుతోంది.

పాకల్లో పొయ్యి అంటించినందుకు చిహ్నంగా పొగలు లేస్తున్నాయి.

రావులమ్మకి జ్వరం. పొయ్యి రాజేయ లేదు. కూలికీ వెళ్ళలేదు. ఏ రోజు కూలికి వెళ్ళకపోతే ఆ రోజు పస్తే.

రావులమ్మ జ్వరంతో మూలుగుతోంది నాలుగు రోజులై కూలికి వెళ్ళడంలేదు. రెండు మూడు రోజులు బియ్యం అప్పు తెచ్చి గంజి కాచి పోసింది. రోజూ అప్పెవరిస్తారు?

అప్పలకొండ "ఆకలే అమ్మా!" అని రాగాలు తీస్తూ తల్లిని కుదుపుతున్నాడు. అలా కుదుపుతూ నాలుగు మూలలా చూస్తు న్నాడు.

ముసిలి అత్తా, మామా పంచలో మూల కాళ్ళు కడుపులో పెట్టుకు పడుకున్నారు.

పదోఏడురాని అప్పలకొండ ఆకలికి ఆగలేక ఏడుపు హెచ్చించాడు.

"ఓయమ్మ : ఆకలీ"

"నానెక్కడ సచ్చేదిరా గూట్లో కుండలో మురమురాయుండాలి అయి మింగు"

"అయెపుడో అయిపోనాయే."

"అయితే కోంటి సీతమ్మనడిగి రెండు పప్పుండ లరువు తెచ్చుకో."

"యీయనందెహె" అన్నాడు కాళ్ళు నేలకేసి కొడుతూ.

"అయితే సావు"

రావులమ్మ మొగుడు రిక్షా లాగేవాడు. ఆ పట్నం వీధులన్నీ ఎత్తుపల్లాలే. ఓసారి డొక్కలో నొప్పి వస్తే పెద్దాసుపత్రిలో పడేశారు. పరీక్ష చేయడాలింకా ముగియ కుండానే అతను ప్రాణాలు వదిలాడు.

ముసిలి అత్తా, మామా, ఒక్కగానొక్క కొడుకు అప్పలకొండా మిగిలారు. వాళ్ళ కోసం కూలీ, నాలీ చేసి కష్టంమీద రోజులు వెళ్ళదీస్తోంది రావులమ్మ. మొగుడుండే రోజుల్లో బాగానే గడిచేది.

రావులమ్మ అనుకుంటుంది. "తన దగ్గరే డబ్బుంటే - పెద్ద డాకటేర్ వాటు కాడకెడితే మినిట్‌లో తణిఖీచేసి మిషన్లో అయేటో పెట్టి - నొప్పి పోగొట్టి - బ్రతి కించేవారని."

కట్టుకున్నాడు సచ్చాడు కష్టాల్లో వదిలి. అది చాలకా సావు అంది కన్నకడుపుని?

ఏటి సెయ్యనుబాబూ మాయదారిజ్వరం ఒగ్గకుండా వుంది. లచ్చువొమ్మని వద్దికి డబ్బులడిగి కొట్లో నాకు కుసిన్ని మిరియా లొట్టా, నీకు రొట్టె కొనుక్కో.

"మరి నీకో."

"నాకేటీ వద్దు బాబూ. మీతాతా మామ్మకి ఎట్టకుండా నానేటి తిన్ను. అందరికీ ఎడతా నంటావు ఆనక ఆకలని సంపుతావు. అక్కడే తినేసిరా"

ఎల్లాగో కొడుకుని సముదాయించి పంపే సింది.

అప్పలకొండ చొక్కాతో కళ్ళుతుడుచు కుంటూ లచ్చువొమ్మ యింట్లోంచి వస్తూ వుండటం నాగులు చూశాడు.

"అప్పలకొండా ఆడకి రావేందిరా?

"వుండెహె ఆకలితో సత్తావుంటే?

"అయితే ఏడకి వెడుతున్నావ్?"

"మా అమ్మకి జొరం. మిరియాలు రొట్టి తేవాలి-రొట్టి నన్నె తినెయ్యమంది."

"ఒరే నాకూ కాస్తెట్టవురా?

"ఏటెహె అసలే ఆకలి మింగేస్తూంటే"

ఈయేళ నాక్కాస్త వోటా ఎట్టావంటే రేపు నీకు వోటా ఎడతా"

"అదెట్లా?"

"అదంతే ఇలారా చెబుతా" అని చెవిలో గుసగుసలాడాడు.

యిద్దరూ తొందరగా అడుగులు వేసి పాకచేరారు. పాకలో పని ముగించుకొని బైటపడ్డారు.

మసక వెన్నెల. తదియ చంద్రుడు వెలవెలా బోతున్నాడు. రాహుకేతువు ల్లాంటి రెండు మబ్బుతునకలు అతణ్ని మింగాయి. అజ్ఞానం దారిద్ర్యంలా చీకటి లోకాన్ని కప్పింది.

చాలా రాత్రి అయ్యాక వారిద్దరూ పుట్టలు పెట్టి వచ్చిన చీమల్లా పాక పంచని చేరి అలిసి నిద్రపోయారు

మామూలుగానే తెల్లవారింది. సంపన్నుని అహంలా సూర్య కిరణాలు చెట్లనీ, పుట్టనీ వేడిగా, వాడిగా గ్రుచ్చుతున్నాయి. మామూలుగానే తెల్లవారిన, ఆ రోజు మనుషులు క్రొత్త సందడిలో పడ్డారు. ఆ రోజు నాగులచవితి, పాకుడుబుసంల్లాంటి పట్టు చీరెలు ధరించిన పడతులు, పట్టుపరికిణీలు ధరించిన అందాల బాలలూ ప్రసాదాలు పళ్ళాల్లో నింపుకుని, పాము పుట్టలపై పులమిగులు వేస్తున్నారు. కొందరు లడీ బట్టలతోటే పుట్టలో పాలు పోయడానికి వస్తున్నారు. దీపావళిలో మిగిల్చిన మందుగుండు సామానుతో పెద్దల వెనక పిల్లలు హుషారుగా గెంతులు వేస్తూ వస్తున్నారు.

తాటిచెట్టు సమీపంలో అసలు పుట్టలూ, నకిలీ పుట్టలూ కూడా వున్నాయి. నాగులూ, అప్పలకొండా అక్కడికి చేరారు.

జన ప్రవాహం చీమల బారుల్లా పుట్టల్ని సమీపించి పూజలు జరుపుతున్నారు. కొందరు దూరంగా నుంచుని చూస్తున్నారు పిల్లలు తారాజువ్వలు ఎగరవేస్తున్నారు. ఇంకా చిన్న పిల్లలు మతాబులు, అగ్గిపెట్టెలు కాలుస్తున్నారు.

"ఒరేయ్ నాగూ తారాజువ్వ చూడ్రా ఎంత పైకి పోయిందో!" అన్నాడు అప్పలకొండ సంభ్రమంగా ఆకాశంవైపు చూస్తూ. "నీ మాపియాళ పైకెళ్ళిందేట్రా కిందకి దించు. అయన్నీ కడుపు నిండినోళ్ళకిరా మనం కడుపు సంగతే ఆలోచించాలి. ఎవరి ప్రసాదం పళ్ళెం పెద్దదో కాస్త కని పెట్టి సూడు". ఒకావిడ అటువైపుగా రావడం చూసి నాగులు "అమ్మగోరూ యిటురండి మంచిపుట్ట. ఎవ్వరూ పాలు పొయ్యనేదు." అని ముందుకొక అడుగువేశాడు.

ఆవిడ వీళ్ళున్న పుట్టదగ్గరకొచ్చి, అక్కడ శుభ్రంచేసి నీళ్ళుజల్లి ముగ్గువేసి ఏవేవో చదువుతూ పూజ చేసింది. పుట్టలో పాలుపోస్తూ "పాలుచ్చుకొని భాగ్యమియ్యి, చిమ్మిలుచ్చుకొని సిరియివ్వు. చలిమిడుచ్చుకొని సంపదయియ్యి. నూకలుచ్చుకొని రూకలియ్యి" అని పైకే చదువుతూ ఒక్కొకటే పుట్టలో వేసి ఆఖరున రెండు కోడి గ్రుడ్లువేసింది

పూజ పూర్తి అయ్యాక కాస్త ప్రసాదం ఆ యిద్దరి చేతుల్లోను విదిపి వెళ్ళిపోయింది

'గుడ్లు తీద్దాంరా' అన్నాడు ప్రసాదంతో



"పడవెళ్లి పోతోందిరా...."

ఫొటో : యస్ యస్. పెండ్యాల, తణుకు

ఆకలి తీరని అప్పలకొండ.

"అంతఆరాటం అయితే ఎలారా వుండు ఆవిడెవరో కార్లో దిగొస్తాంది గమ్మత్తు చూద్దాం" అన్నాడు వాడు.

కార్లోంచి దిగిన భాగ్యమ్మ బరువుగా అడుగులేస్తోంది. ఆమె శరీరమూ బరువైనది. నగలూ చీరా కూడా బరువైనవే ధరించింది.

తనకేసి తాను చూసుకుంటూ అందరు తనని చూస్తున్నారో లేదో నాలుగు వైపులా పరికిస్తూ వీళ్ళున్నపుట్ట దగ్గరకే వచ్చి వాళ్ళని ఎగాదిగా చూస్తూ "పూజ చేయని పుట్టయి లేవుట్రా?" అని ప్రశ్నించింది

ఆవిడ గుడ్లువేసే దాపటుకావని ఆపడ పళ్ళెం చూసి గ్రహించేసేశాడు నాగులు వెంటనే—

"లేవండమ్మగోరు ఇందల కోడిగుడ్లు కూడా వేసినారు" అన్నాడు.

"ఒరే అబ్బాయీ ఆ గుడ్లు తీసేస్తావా? నీకు డబ్బులిస్తాను అంది" నాగులు కోరుకున్నదీ అదే.

"ఎంతిస్తారు?

"పావలా."

"ఇద్దరికీ చెరో పావలా యియ్యండమ్మ గు."

"యిద్దరు ఎందుకు? ఒకరు తీస్తే చాలా? అదే యిద్దరూ పంచుకోండి."

అప్పలకొండా, నాగులూ ఒకరి ముఖం



మహాబలిపురంలో దీప స్తంభం

ఫొటో : శంఖం లోకేశ్వర్ పేరాల

ఒకరు చూసుకున్నారు. ఒకర్ని ఒకరు తోసుకున్నారు నేనంటే నేనని. చివరికి అప్పలకొండే పుట్టలో చెయ్యి పెట్టాడు. పెట్టిన మరుక్షణమే "అమ్మో" అని పెద్ద కేక పెట్టి చెయ్యి లాగేసుకున్నాడు. ఆ తరువాత భయంతో గజగజా వణుకుతూ విరుచుకుపడిపోయాడు. ముఖంలో రంగులు మారిపోయాయి. శరీరం బిగదీసుకుపోయింది, కాళ్ళూ చేతులూ కొట్టుకున్నాడు. కొద్ది క్షణాల్లోనే నోట్లోంచి నురగలు రావడం ఆరంభించాయి.

నాగులు బాణంలా పాకలవైపు దూసుకుపోయాడు.

జనాలు ఏం జరిగిందేం జరిగిందంటూ ముందుకు తోసుకు వచ్చి అప్పలకొండ చుట్టూ మూగారు. ఆ జనాలు ముందుకు తోసుకువచ్చేటప్పుడు. భాగ్యమ్మ భాగ్యవశాత్తు వెనక్కి నెట్టివేయబడింది. గబగబా అడుగులు వేసి కాల్లో పడింది.

దుమ్ములేపుకుంటూ కారు వెళ్ళిపోవడం ఎవరూ గమనించలేదు.

"కక్కుర్తి నాయాలు గుడ్లకోసం చెయ్యెట్టుంటాడు" అన్నారొకరు.

"నాగేంద్రుడికి కోపం వచ్చిందన్నాడు" మరొకడు.

"మంత్రగాణ్ని పిలవండంటున్నాడు మరొకడు."

అంతా తలోమాటా అంటున్నారు.

అప్పలకొండ బాధతో భయంతో మెలికలు తిరిగిపోతున్నాడు. అందరూ చుట్టూ చేరి అతనికి ఊపిరాడకుండా చేస్తున్నారే తప్ప ఒక్కరికీ తమ ఊళ్లో పెద్దాసుపత్రివుందనీ అక్కడికి చేరుద్దామని ఊహరావడంలేదు.

చుటుపట్ల జనం, పాకల్లో జనమంతా అప్పలకొండ దగ్గరకి ఉరుకులు పరుగులు పెట్టారు. ఎవరో కాస్త ముఖంమీద నీళ్ళు జల్లారు. నోరుతుడిచి నోట్లోనీళ్ళు పోశారు.

కొందరు పాము మంత్రగాళ్ళకోసం పరుగులు తీశారు.

ఇంతలో గాలి తుఫానులా 'నా కొడుకో' అంటూ వచ్చి కొడుకుమీద వాలిపోయింది రావులమ్మ. ఆమెను ఇద్దరు ఆడవాళ్ళు పట్టుకున్నారు.

ఊగిపోతూ శోకాలు మొదలెట్టింది.

"ఆకలో అన్నావ్ అప్పలకొండోయ్. నీ కన్నా ఆకలెక్కువైపోనాది నాగేంద్రుడికి అప్పలకొండోయ్. నీ కాటు సూసుకుని బతకనురోయ్. సన్నన్యాయం చేసినాడురోయ్ దేవుడు నాగుబాముయా, నిన్నందరు కడుపు సలవకి పూజ్జేస్తారే నా కడుపుకు సిచ్చెందుకు ఎట్టినావురో". అని గుండెలు బాదుకుని అందరి గుండెలూ చెదిరిపోయేలా ఏడుస్తాంది రావులమ్మ.

"పాపం ఆ కుర్రాణ్ని చూసుకు బతుకుతోంది" అన్నారొకరు.

'పుట్టలో గుడ్లెయ్యకపోతేనే' అన్నాడు మరొకడు.

"అపరాధ మన్నారింకొకరు.

మంత్రగాడుంటే బాగుండు నన్నారొకరు

అంతేగాని ఆసుపత్రికి తీసుకువెడదామని ఎవరికీ తట్టలేదు.

అప్పలకొండ అర్భక ప్రాణాలు గాలిలో కలిశాక. వాడి శవాన్ని రావులమ్మనీ పాకల దగ్గరకి చేర్చారు.

తాను చవితి పూజెయలేదు. అందుకే నాగుబాము కాటేసిందనుకుంటుంది రావులమ్మ?

అంతేగాని అసలు కాటు ఆకలివేసిందనీ అది సవ్యంగా తీర్చుకొనే పరిస్థితులింకా సమాజంలో రాలేదని. అటువంటి పరిస్థితిలో లేమని రావులమ్మకి తెలియదు: